క్లుప్తంగా

24న మహా సుదర్శన హోమం

ముత్తుకూరు : ముత్తుకూరులోని శ్రీదేవి-భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీన మహా సుదర్శన హోమం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. అదే రోజున అగ్నిప్రతిష్ట, శాంతి కల్యాణ మహోత్సవం, పవిత్రజల సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ వేడుకల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



కొడవలూరు : నార్త్రురాజుపాళెం దిన్నెలోని ద్వారకామయి శిరిడీ సాయిబాబా మందిరంలో 'హరిహర తనయ అయ్యప్ప సేవా సమాజం' ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని భజనలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాబా ఆలయంలో ఈ నెల 30వ తేదీ వరకు అయ్యప్పస్వాములకు అన్న సంతర్పణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మధు, శరణం, వి.రవి తదితరులు పాల్గొన్నారు.

24న చలో కలెక్టరేట్



నెల్లూరు (టౌన్): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్‌ను ఈ నెల 24న నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి హర్ష, శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వీఆర్ డిగ్రీ కళాశాలను వెంటనే ప్రారంభించడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నేతలు నరేంద్ర, బాలాజీ, సంతోష్, అశ్విన్, సుమంత్, కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు ఉచిత భోజన వసతి

నెల్లూరు రూరల్: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ఇక నుంచి ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నామని భారత్‌సేవా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశిఖామణి, ఖాసిం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ హోటళ్ల నిర్వాహకులు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ వారం నుంచి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు.

సాహిత్యజ్యోతి పురస్కార ప్రదానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ ఆదివారం విజయవాడలో సాహిత్యజ్యోతి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడారు. విజయవాడలో జరిగిన 125వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ పి.శ్రీలక్ష్మి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

విడవలూరు : మండలంలోని పొన్నపూడి పెద్దపాళెంలో కోడి పందేలు జరుగుతున్నాయనే సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రెండో యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేత

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో సాంకేతిక కారణాల వల్ల రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. అయితే, ఒకటో యూనిట్లో 420 మెగావాట్లు, మూడో యూనిట్లో 590 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు ఇంజినీర్లు ఆదివారం వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



ఆత్మకూరు: శివాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆత్మకూరు: విశేషాలంకరణలో విశ్వేశ్వరుడు

ఆత్మకూరు: కోటి సోమవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో మహాశివుడికి ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. విశ్వేశ్వరుడు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలఘనాథస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని శివలింగాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగం: కోటి సోమవారం సందర్భంగా త్రివేణి సంగమంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్పాలతో భారీ శివలింగాకృతిని రూపొందించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

చేజర్ల: కార్తీక మాసం కోటి సోమవారాన్ని పురస్కరించుకుని కోటితీర్థంలోని శివాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెన్నానదిలో స్నానమాచరించి ఆకాశ దీపాలు వెలిగించి ఉపవాస దీక్షను విరమించారు.



సంగంలోని సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నేత్రపర్వంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణానికి హాజరైన భక్తులు

ఆత్మకూరు: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జేఆర్‌పేటలోని పద్మావతి, లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవేరులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఉభయకర్తలుగా చిల్లూరు రవి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు చేజర్ల సచివాలయం పరిధిలోని తిమ్మాయపాళెం, చేజర్లకండ్రిక, బోడిపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని జగనన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. పాడి రైతుల కోసం బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు అందుబాటులోకి తెచ్చారని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని అవసరమైన పనులు చేపడుతున్నామని తెలిపారు. తిమ్మాయపాళెంలో ప్రజలు డ్రైనేజీ నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోడిపాడు మాజీ సర్పంచ్ బోయెళ్ల మాలకొండారెడ్డి, ఉపసర్పంచ్ రత్నారెడ్డి, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంచలనారాయణరెడ్డి, కల్యాణ్, పెంచలయ్య, పెంచలస్వామి, గువ్వల బాలయ్య పాల్గొన్నారు.



బోడిపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎంపీపీ తూమాటి

వైభవంగా గంగమ్మకు పొంగళ్లు

చేజర్ల: చేజర్లలో జరుగుతున్న గంగమ్మ తల్లి జాతరలో భాగంగా మూడో రోజు ఆదివారం పొంగళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత మహిళలు సామూహికంగా పొంగళ్ల సామగ్రితో మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. గంగమ్మను స్వీట్స్‌తో విశేషంగా అలంకరించి అనంతరం పొంగళ్లు పెట్టి గంగమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా శనివారం రాత్రి గంగమ్మ గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.గంగమ్మ మూలవిరాట్లును డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించారు.



డ్రైఫ్రూట్స్ అలంకారంలో గంగమ్మ మూలవిరాట్టు

వైభవంగా సీతాలమ్మ, పోలేరమ్మ విగ్రహాల ప్రతిష్ట



విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని హరిజనవాడలో సీతాలమ్మ, పోలేరమ్మ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత విగ్రహాలకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహాలను ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయాల పరిధిలోని ఆరు వలంటీర్ల ఖాళీల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీ నాగేశ్వర రావు ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులతో పాటు వాటి జెరాక్స్ కాపీలు రెండు సెట్లు, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు కులగణనపై శిక్షణ

ఉదయగిరి: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సోమ, మంగళవారాల్లో కులగణనపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి చేపట్టనున్న కులగణన సర్వేపై ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 20న శకునాలపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం, నేలటూరు, ఉదయగిరి-1,2,3, కొండాయపాళెం, 21న జీ చెరువుపల్లి వెంగళరావునగర్, బండగానిపల్లి, కృష్ణంపల్లి సచివాలయాల పరిధిలోని వారికి శిక్షణ ఉంటుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వరికుంటపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వరికుంటపాడుకు చెందిన షేక్ మీరావలి(50) నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు..ఈ నెల 2న షేక్ మీరావలి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తూ దుత్తలూరు మండలం నందిపాడు సమీపంలో ఆగి ఉన్న కట్టెల ట్రాక్టర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ,కుమారుడు ఉన్నారు.

ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం



16వ వార్డులో రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో సచివాలయ నిధులతో ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. 16వ వార్డు పరిధిలో వార్డు ఇన్‌చార్జి ముజీబ్, 7వ వార్డు పరిధిలో టౌన్ బూత్ కమిటీ మేనేజర్ సయ్యద్ జమీర్ పర్యవేక్షణలో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

టీ దుకాణంపై దాడి

ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ సమీపంలో టీ దుకాణం నిర్వహిస్తున్న రాజస్థాన్‌కు చెందిన జవాన్‌సింగ్‌పై మార్కెట్‌లో పనిచేసే మస్తాన్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి మస్తాన్ టీ దుకాణం వద్దకు వచ్చి టీ సిగిరెట్లు ఇవ్వాలని కోరాడు. అప్పటికే అతను చాలా నగదు బాకీ ఉండడంతో డబ్బులు ఇవ్వాలని జవాన్ సింగ్ కోరాడు. దీంతో మస్తాన్ దుర్భాషలాడుతూ ఇక్కడకు వచ్చి మేము టీ అడిగితే ఇవ్వవా అంటూ దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేశాడు. టీ గ్లాసులను పగులగొట్టాడు. అక్కడున్న వారు మస్తాన్‌ను వారించి దూరంగా తీసుకెళ్లారు. అయినా మరోసారి దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

చేజర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ పేర్కొన్నారు. చేజర్లలో యూటీఎఫ్ భవనంలో మండల కార్యవర్గ సమావేశానికి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి పోరాటాల ద్వారా సాధించిన విజయాలను గుర్తుచేశారు. పే స్కేళ్లలో వచ్చిన మార్పులు, బదిలీల్లో కౌన్సిలింగ్ విధానం ప్రవేశపెట్టడం, హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ల నియామకాలను వివరించారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేద్దామన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఏటూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎన్ రమణయ్యను సన్మానించారు. బదిలీలపై ఇతర మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడు ఏ సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు ఆర్ వెంకటకృష్ణారెడ్డి, సహాధ్యక్షులు ఏ వెంకటేశ్వర్లు, షేక్ షకీల, ప్రధాన కార్యదర్శి నాగినేని రమణయ్య, కోశాధికారి ఎస్ బుజ్జయ్య, ఆడిటర్ ఎస్ శంకర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా పీ నరహరి, సీపీఎస్ కన్వీనర్‌గా షేక్ మస్తాన్‌బాషా, మహిళా కన్వీనర్‌గా ఆర్వీ శేషమ్మ ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం రవిబాబు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రమణయ్యకు సత్కారం

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



జలదంకిలో ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారిణి



ఆత్మకూరులో ఇందిరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జలదంకి: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జలదంకి గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి ఎం విజయలక్ష్మి, లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ, గరిబీ హఠావో, 20 సూత్రాలు, తదితర కార్యక్రమాలతో ప్రపంచ దేశాల్లో గొప్ప మహిళా నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆమెను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ కరిష్మా, వై కావ్య, పాఠకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా ఇందిర తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, పేదరిక నిర్మూలనకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, నాయకులు జి రాంకీ, వేణు, ఎల్ రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్‌డీ రసూల్, కే విష్ణు, శ్రీనివాసులు, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలు



ఆత్మకూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



అల్లూరులో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూరు: గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలని లైబ్రేరియన్ శ్రీనివాసరాజు పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞానదాయక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సోమవారంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. చివరి రోజు వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. తొలుత దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, నాణేల సేకరణ కర్త ఎండీ వాయేజ్, విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ ఎల్ తనూజ, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని లైబ్రేరియన్ పీ కోటేశ్వరమ్మ పేర్కొన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అల్లూరు గ్రంథాలయంలో దిశ చట్టంపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం డిజిటల్ గ్రంథాలయాలపై చర్చ, నిర్వహించి వారోత్సవాలను ముగించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

సంగం: రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు తీసుకొచ్చిన దిశ యాప్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సంగం గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఝాన్సీలక్ష్మీభాయ్, ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివే చాలా మంది ఉన్నతస్థితికి చేరుకున్నారని చెప్పారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమతి, నేతాజీ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ మాదర్‌బాషా తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రవినాయక్

వరల్డ్‌కప్ క్రికెట్ వీక్షణకు బిగ్ స్క్రీన్ ఏర్పాటు

ఉదయగిరి: భారత్-ఆస్ట్రేలియా నడుమ ఆదివారం జరిగిన క్రికెట్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణకు క్రికెట్ అభిమానుల సౌకర్యార్థం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు వీలుగా చుట్టూ పరదాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు.



బిగ్ స్క్రీన్‌లో మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

అభివృద్ధి పథంలో పడుగుపాడు సొసైటీ

కోవూరు : జిల్లాలో పడుగుపాడు సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక శాంతినగర్లో ఉన్న పడుగుపాడు సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మొక్కలు నాటి సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలో ఇప్పటికే నాలుగు గోదాములను నాబార్డు సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ ప్రాంగణంలో 200 టన్నుల గోదాము కూడా సిద్ధంగా ఉందని, రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేవరకు గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చన్నారు. అనంతరం పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మొక్కలు నాటుతున్న సొసైటీ సభ్యులు